# 'ఊఁ' అన్నాడు జగన్నాధం

పడ్లపట్ల దయానందం

కథానిక

చల్లని పిల్లవాయువులు మెల్లగా వీస్తున్నాయ్- అప్పుడప్పుడు విసురుగాకూడా వేస్తున్నాయ్ లెండి. కాని మొత్తంమీద చూసుకుంటే మెల్లగా వీస్తున్నాయని అంగీకరించక తప్పదు. దూరాన ఎక్కడో బహుశా కోయిలలే అయి ఉండాలి అదేపనిగా కూస్తున్నాయ్.

పశ్చిమాన దిఙ్మండలపు టంచునుండి, సూర్యుడు మెల్లగా క్రమక్రమంగా క్రిందికి జారిపోతున్నాడు- జారిపోయాడుకూడా. అయినా ఆ సంధ్యకాంతి పశ్చిమభాగాన్ని ఇంకా అలా అంటిపెట్టుకునే ఉండటంవల్ల, ఆ ప్రాంతం అంతా, దాదాపు కుంకుమతో అలికినట్లుగా ఉంది. మేఘపు తునకలు ముచ్చటగా కదలాడుతున్నాయ్. వాటిఅంచులపై సదరుకాంతి పడటంవల్ల చివరిభాగాలు వింతగా మెరుస్తున్నాయి.

రకరకాల పక్షుల గుంపులు పలు రకాలుగా అరుస్తున్నాయ్-వాటి వాటి గూండ్లకు పోబోతూ.

ఇక పశువులకాపర్లు, లిల్లాయిపదాలు పాడు కుంటూ గొడ్లను తిరిగి దొడ్లకు తోలుకుపోవడం మామూలే. అట్టిసమయంలో పల్లెపడుచులు పవిట బిగించి వయ్యారంగా కోనేటినీరు జేరబోసుకోవడం సహజం.

ఇట్టి వాతావరణాన్ని నిశితంగా పరిశీలిస్తూ తీరుబడిగా ఇంటి అరుగుమీద మఠంవేసి, లంకాకు పొగచుట్టను పళ్ళతోపట్టి పెదవులమధ్య ఆ చివర నుండి ఈ చివరకూ - ఈ చివరనుండి ఆచివరకూ నెట్టుతూ, మధ్యమధ్య ఒక్కోదమ్ము లాగి పొగను బయటికొదలి, వలయాల నేర్పరుస్తూ చూచి ఆనందిస్తున్న జగన్నాథం ఉన్నట్టుండి "అమ్మా" అని గావుకేక పెట్టాడు.

"ఏమిట్రా నా చిట్టినాయనా" అంటూ గాభరాగా వచ్చింది బుచ్చమ్మ ఇల్లూడుస్తున్న చీపురును యథాతథంగా చేతనే ధరించి.

"అమ్మా చూచావుటే...మరే...మరే... సుబ్బులు నన్నుచూచి వెక్కిరించి నవ్వి పారిపోయిందే" అన్నాడు బుంగమూతిపెట్టి.

అమాంతం చీపురు విసురుగా ఓ మూలకు విసిరి, చెంగు బొడ్డునదోపి గెడ్డంక్రిందికి చెయ్యి పోనిచ్చి, చూపుడు వ్రేలుతోనూ, బొటనవ్రేలి తోనూ రెండుదవళ్ళూ నొక్కుకుంటూ——

"అసిదాని జిమ్మడా ఎంతపొగరు...దానందం మహా కారిపోతున్నట్టు! దానందంమీద పట్టలేదూ వేదండం ... అటువంటి రాలుగాయి గాబట్టే వచ్చిన మనువులు వచ్చినట్టే పోతున్నాయ్... ఎంత పేట్రేగిపోయిందీ ... 'బావ' అన్న బిడియమూ, భయమూలేకుండా అలా వెక్కిరించి నవ్వుతుందీ...ఉండు దానంతు కనుక్కుంటాను" అంటూ శపథంచేసి, తిరిగి చీపురు తీసుకుంది బుచ్చమ్మ.

తల్లి రౌద్రాకారంలో ఉగ్రనరసింహుడు కన్పించాడు జగన్నాధానికి. ఏదో అనాలోచితంగా పిలిచి చెప్పేశాడేకాని తను చెప్పినందువల్ల రాద్ధాంతం జరుగుతుందని తెలుసు. అందుకే సుబ్బులెన్ని చేసినా తల్లికెన్నడూ చెప్పలేదు. అనాలోచితంగా తనుచేసిన పొరపాటుకు తనని తనే నిందించుకున్నాడు. సుబ్బులు తిరిగి నీళ్ళబిందెతో పోయేటపుడు పిలిచి, యుద్ధానికి సన్నద్ధమౌతుందేమోనని భయపడ్డాడు జగన్నాథం. ఇక చేసేది లేక, తల్లివంక జాలిగా చూస్తూ "పోనీలేవే అమ్మా అదెపుడూ అంతే. అసలది మంచిదే. నన్నుచూస్తే దానికి సరదా. ఉట్టినే నేనుడుక్కుంటానని అదలా ఏడ్పిస్తుంది - అంతే పోనిద్దూ" అన్నాడు జగన్నాధం.

ఆ కోపప్రవాహాని కడ్డునిలిస్తే ఆ తాకిడికి తనే తట్టుకోవాలన్న విషయం ఎంత అమాయకుడైనా జగన్నాధానికి అనుభవమే. అనుకుంటున్నట్లుగానే

తను కట్టబోయిన అడ్డుగోడ ఫలితంగా ఆ ప్రవాహం శరవేగంతో తనపై పునకే మళ్ళింది.

"హోరి చచ్చు వెధవా నువ్వింత పిచ్చవెధవ్వి కాబట్టే అడ్డమైనవాళ్ళూ నిన్నింత యాగీచేసి, మరికాస్త పిచ్చసన్యాసిని చేస్తున్నారు. నువ్వసలు లోనికి తగలడు...ఏవమ్మోయ్ అచ్చమ్మక్కా- ఇలా ఓసారి రామ్మా ఇప్పుడే వెడుదువుగాని" కొడుకును మందలించి లోనికంపి నీళ్ళబిందెతో గుమ్మముందునుంచి పోతున్న, ప్రక్కింటి అచ్చమ్మని, గుమ్మంలో నిలబడే ఆహ్వానించింది.

నీళ్ళబిందె అరుగుమీదుంచి "ఏమిటి చెల్లమ్మా ఎవరిమీద కూకలేస్తున్నావ్" పరామర్శిస్తూ వచ్చింది అచ్చమ్మ. గాలికి వాన తోడయింది ఇక తుఫాను ప్రళయం అమ్మబాబోయ్! అనుకున్నాడు లోనికిపోయి కూర్చున్న జగన్నాథం.

"చూచావా. అచ్చక్కా దానిపొగరు" అంది బుచ్చమ్మ, సెంట్ పర్సెంట్ ఆ శ్చ ర్యం తో ముఖాన్ని నింపుకుంటూ.

"దేనిపొగరూ!" అంది అచ్చమ్మ క్వొశ్చన్ మార్కును ముఖంలో సృష్టించుకుంటూ.

"ఇంకెవరూ మేనకోడలు ఆ సుబ్బులు"

"ఆ...ఏంచేసిందేమిట" మరి కాస్త ఆత్రంగా ప్రశ్నించింది అచ్చమ్మ బుచ్చమ్మలోని ఎమోషన్‌కి మరి కాస్త దోహదం ఇస్తూ.

"బావన్న భయమ్మాన్నా లేకుండా మావాణ్ణి వెక్కిరించి పారిపోయిందట ఎంత పొగరో చూచావా దానికీ మాకూ ఏం సంబంధం చెప్పు. మేం కాకపోయాక, ఇంకా మాతో దానికి పనేమిటి? దానందంమీద పట్టలేదూ, మా వాడిది. ఎట్లాగయితేం, చ దు వు తూ ం ది ఇస్కూలు ఫైనలు ఓ యబ్బో ఆపాటి చదువుకున్నవాళ్ళని మనం ఎరగం కనుకనా? రామాయమ్మగారి 'రాధ' పట్నంలో కాలేజీలో చదువుకోవడంలా. నాకు తెలియకడుగుతా దానికంటే పెద్ద చదువాదీనిది ఆ రాధ కాలిగోటికి పోలుతుందీ ఇది? దేన్ని చూసుకునో దీనికింత పొగరు. గానియ్ ఇటు—చెవడా లెక్కదీస్తా" అంది బుచ్చమ్మ.

"అవును చెల్లమ్మా నేనూ చూస్తూనే ఉన్నా గర్వంజాస్తీ ఎప్పుడైనా పిలిచి పలకరించబోతే ఏమిటో చీమలు జెర్రెలు పాకుతున్నట్లే మాట్లాడుతుంది. ఎంతైదయినా, పెళ్ళి కావలసిన ఆడపిల్లకి అంత గర్వం అహంభావం కూడదమ్మా పోనీ అన్నయ్యతోటే ఒకసారి గట్టిగా చెప్పేయక పోయావా" తాళంవేసి శ్రుతి చూచింది అచ్చమ్మ, బుచ్చమ్మ రాగం స్థాయినందుకుంది" అదేవిటమ్మా, అన్నీ తెలుసుండి కూడా, మళ్ళీ వాడిముఖం చూడమంటావా ఆ సంబంధం ఏనాడో త్రెంచుకున్నా. ఇంకా వాడు నాకు అన్నేమిటి వాడికి నేను చెల్లెలనేమిటి ఆ మాత్రం అభిమానమున్న వాడైతే నోరు తెరచి అడిగినందుకు, కాదంటాడా? వాడు కాదన్నంతలోనే కొంపలేమీ అంటుకు పోలేదులే లోకమేమీ గొడ్డుపోలా మావాడికి ఆ మాత్రం దొరక్కపోదు ఏదో అయిన సంబంధం అని కాని లేకపోతే నాకేం అవసరం రక్తాన్ని పంచుకు పుట్టినవాడైనా ఆ మర్యాద దక్కించుకోలేకపోయాడు ఇంతకీ అసలు ఆయనే ఉంటే నేనింత—" గుండెలోని దుఃఖంగొంతులో కొచ్చి కంఠం పూడిపోయింది. కళ్లు తుడుచుకోడానికీ, చెంగుకోసం తడుముళ్ళాడింది.

"ఊరుకో చెల్లమ్మా విచారించి ఏంలాభం పోయినవాళ్లు తిరిగొస్తారా? మహరాజు వొదినా, వొదినా అంటూ ఎంత కలివిడిగా ఉండేవారు. మంచివాళ్ళకు రోజులు కావమ్మా ఇక పెళ్ళికాక పోతుందా ఊ అనాలేకాని తెల్లవారేపాటికి లక్షా తొంభై సంబంధాలు ఏవిటో" వారించింది అచ్చమ్మ.

శాంతించింది బుచ్చమ్మ.

జగన్నాథానికి రెండో చీకూ, చింతా ఏమీ లేదు. తాతలు కట్టించిన గుమ్మట్లులాంటి మండువాలోగిలి. కాలువక్రింద ఏడెకరాలు, చెఱువు క్రింద ఎనిమిదెకరాల మెఱక బాపతు మొత్తం పదిహేనెకరాలమీద వంద బస్తాలపంట వద్దనుకున్నా కాలిమీద కాలువేసుకుక్కూర్చుంటేఇంటికి నడిచొస్తుంది. తండ్రిపోయినా మొగరాయుడిలా సర్వం చక్కబెట్టుకుకు పోగల తల్లి, అందువల్ల ఇరవై సంవత్సరాలు వచ్చినప్పటికి బాధ్యతనేది ఏదీ బుజాన్నేసుకోవలసిన అవసరం కలగలేదు జగన్నాథానికి. అసలు తల్లే కలుగనీయలేదు.

"చంటివాడు మా నెత్రినాయన" గానే తల్లి దృష్టిలోఉండటంవల్ల లోకానికిసైతం జగన్నాథం అవిధంగానే కన్పించసాగాడు.

జగన్నాథం చేయవలసిన పనల్లా, మూడు పూటలా భుజించడం ఓ డజను చుట్టలు తగుల బెట్టడం అంతే.

పెద్దబాలశిక్ష కొట్టినపిండి. పన్నెండువరకు ఎక్కాలు గుక్కతిప్పుకోకుండా అప్పగించగలడు. పూసలపాటి జగన్నాథంవ్రాలు అన్న అక్షరాలవి ముత్యాల్లా లిఖించి మురిసిపోగలడు.

ప్రొద్దుటే లేచి, నిమ్మకాయంత వెన్నముద్దతో అప్పుడే చిలికిన కవ్వం మజ్జిగతో చల్దారగించి తల్లితో తల దువ్వించుకొని చొక్కా వేసుకుని పంచె బిగించి, తుండొకటి బుజంమీద వేసుకుని, వీధి అరుగుమీద తిష్ఠవేస్తాడు చుట్టలు తగుల బెడుతూ.

దారేపోయే ప్రతివారూ, చిరునవ్వుతో పలక రిస్తూ పోతుంటారు. ఉచితరీతిని వారికి సమా ధానాలిస్తూ, సంతోషులనుచేస్తాడు జగన్నాథం. న్యూసుపేపరు రోజూ చూస్తాడు. అతి సన్నిహి తులతోమాత్రం స్థానిక రాజకీయాలు చర్చిస్తాడు.

ఆరోజు ప్రొద్దున తలదువ్వుతూ అందిబుచ్చమ్మ:

"ఒరే నాయనా! సుభద్ర నెరుగుదువట్రా?"

"ఎవరూ? మన రాయుడు గంగయ్యగారి, తోడల్లుడు తమ్ముడు కూతురేనా" తిరిగి ప్రశ్నిం చాడు జగన్నాథం.

"ఆ, అవునవును. దూరపు బంధుత్వం కూడాను. తొమ్మిది చదువుతూందట, అచ్చమ్మక్క చెప్పింది. ఐదువేలు కూడా ఇస్తారట..." బుచ్చమ్మ చెప్పుకు పోతోంది, జగన్నాథం "ఊఁ" కొడుతున్నాడు.

"చూడు ఓరే! ఈ రాలుగాయి సుబ్బులు, ఆ పిల్ల కాలిగోటికి కూడా పోలదనుకో. చక్కని ఛాయ, చిక్కని జుత్తు, తీర్చిదిద్దిన కళ్లు, ముత్యంలా ఉంటుందనుకో."

"అచ్చమ్మపెద్ది చెప్పిందా, నువ్వు చూచావా అమ్మా!" అద్దంలో ముఖంచూచుకుంటూ యథా లాపంగా అడిగాడు జగన్నాథం.

"ఏమిట్రా వెధవ వాగుడూ నువ్వూను. పెద్ది చెబితే ఒకటీ, నేను చూస్తే ఒకటీనా? రాత్రంతా ఈ గొడవే చెప్పింది. నువ్వు 'ఊఁ'అంటే చాలు. ఆ సుబ్బులు వట్టి రాలుగాయిరా! ఒకవేళ దాన్న నుకున్నా చెప్పులుమోతేసి ఆడిస్తుందికాని, సంసారం తిన్నగాచేసి ఏడుస్తుందీ. అంతా నీ పిచ్చిగాని, ఏమంటావుఁ"అంది కొడుకుముఖం పైకెత్తి.

"అమ్మా!"అన్నాడు జగన్నాథం అద్దం క్రింద పెడుతూ.

"ఏం నాయనా"అంది బుచ్చమ్మ జగన్నాథం ముఖంవంక ఆత్రంగా చూస్తూ.

"హాఁ. మరేంలేదు. అన్నం పెడతానను, ఊఁఅంటా. తలదువ్వుతానను, "ఊఁ"అంటా. చుట్టకాల్చుకోమను ఊఁఅంటా. పెళ్ళిచేస్తానను 'ఊఁ'అనను, ఊహుఁ అంటా. తెలిసిందా అమ్మా" అన్నాడు లేచి అరుగువైపు నడుస్తూ.

"హోరి వెర్రివెధవా. ఇంత మొండికెత్తేవేరా... చూస్తూండు నిన్నేంచేస్తానో. ఇకమీద నీ ఆటలు సాగవు. బలవంతానైనా ఆ ముళ్ళు వేయిస్తా. ఏమనుకుంటున్నావో"హుంకరించింది బుచ్చమ్మ.

అరుగువైపునకు పోబోతున్నవాడల్లా గుమ్మం దగ్గర నిలిచి వెనక్కితిరిగి "అమ్మా, ఒక విషయం అడుగుతాను, నిజం చెబుతావా"అన్నాడు.

"ఎమిటి?"కోపంగా అంది.

"మరేంలేదు, మామయ్య దగ్గరకెళ్ళి కట్నం యెంత అడిగావమ్మా, ఐదువేలేకదూ!"

"నీకెవరు చెప్పార్రా! అయినా అడిగితేమాత్రం ఏం? ఆమాత్రం రాదా నీకు."

"వస్తుందమ్మా, వస్తుంది. కాని పిల్లమాత్రం అటువంటిది రాదంటున్నా అంతే. అయినా ఒక విషయం సుబ్బులంటే నీకెందుకమ్మా అంత కోపం? నీ ఆటలు సాగనివ్వదేమోననికదూ నీ భయం. అదే పరాయిదెవరైనా ఐతే,చక్కగా చేతికింద ఉంచుకోవచ్చుననే ఆశ నీకు. నాకంతా తెలుసమ్మా" అన్నాడు జగన్నాథం కుండబ్రద్దలుకొట్టినట్లు.

కోపంతో ఓవర్లోడై, కళ్లు చింతనిప్పుల్లాచేసు కుని, గాజులు వెనక్కి సవరించుకుని, దవళ్లు సాగ దీసుకుంటూ గట్టిగా ఏదో అనబోయింది బుచ్చమ్మ. మొదట కొన్నిక్షణాలవరకూ నిర్ఘాంతపోయింది. "వీడేనా ఆ మాటలంటున్నది. లేక మరెవరైనా అనిపిస్తున్నారా?" అని అనుమానపడింది. ఎంత అమాయకుడైనా, కొన్ని కొన్ని విషయాలలో మొండిపట్టుపట్టి నెగ్గించుకుంటాడన్నది బుచ్చమ్మకి తెలిసిన విషయమే. అయితే ఈ విషయంలో ఇంత మొండికేస్తాడన్నది మాత్రం బుచ్చమ్మ కలలో కూడా ఊహించనట్టి విషయం.

అసలు పెళ్ళి కాకముందే. ఇటువంటి ఉద్దేశ్యంతో ఉన్నాడంటే రేప్రొద్దుట పెండ్లయిన తరువాత నిజంగా తనకిక గొడ్డపాక కాపురం తప్పదేమోనన్న విషయం స్ఫురించేసరికి బుచ్చమ్మ నవనాడులూ నిలువునా క్రుంగిపోయినై. ఉద్రేకం గుండెల్లోంచి తోసుకుని బయట పడింది.

"శాంతించమ్మా మరేం ఖంగారుపడకు సావకాశంగా ఆలోచించుకోవచ్చులే." అన్నాడు తిరిగి జగన్నాథం.

దీంతో బుచ్చమ్మ హృదయంలో కోప భాండం, భళ్ళున బ్రద్దలై పోయింది. "నీకేం పోయే కాలం వచ్చిందిరా-"అన్న తొలివాక్యాలతో విసురుగా సింహద్వారందగ్గరకి నాలుగడుగులు వేసింది.

"పోనియ్ అమ్మా లోనికెళ్ళి సావకాశంగా తిట్టు. బయటజనం" అన్నాడు జగన్నాథం.

"ఆ సిగ్గుకూడా ఏడ్చిందీ నీకు" అని బయట గుమ్మంముందు నుంచిపోతూన్న పిచ్చయ్య బావని చూచి, సిగ్గుపడి లోనికిపోయింది బుచ్చమ్మ.

మఠం వేసుకుని బుద్ధుడిలా అరుగుమీద కూర్చున్నాడు జగన్నాథం. చుట్ట వెలిగిస్తేకాని జగన్నాథం బుర్రసరిగా పరుగిడదు. తనలా కూర్చుని, చాలా విషయాలనుగూర్చి గాఢంగా ఆలోచించుకోవాలని ముందుగానే తీర్మానించుకోవడంవల్ల ప్రథమంగా చుట్టముట్టించాడు.

సుబ్బులు చదువుకుంది, అందమైంది, తెలివైంది. తనూ పర్వాలేదు. ఉద్యోగాలు చేయడానికి కావలసిన చదువుతో తనకి పనిలేదు. ఉత్తరం వ్రాయగలడు. ఉత్తరం చదవగలడు. ఆమాత్రం చాలదూ. ఇక అందం విషయంలో మట్టుకు ఏంలోపం! మెలితిరిగి, సన్నగా, మెరుస్తూ కన్పించింది దండ. రీవిగా నువ్వుకున్నాడు. ఉంగరాలు తిరిగున్న జుత్తుల్లోకి వేళ్ళు సగర్వంగా పోనిచ్చాడు. 'ఫర్వాలేదు సుబ్బులికి అన్నివిధాలా సరిపోతాను.' అనుకున్నాడు. కాకపోతే తనను చాలామంది మెత్తనివాడంటారు. అలా అనుకోవడంలో తప్పుకూడాలేదు. తను అందరిలా బడబడ వాగేయడు. లేనిపోనివన్నీ నెత్తినేసుకోడు. నిర్వహించగలిగితే, గంపెడు సంతోషంతో గంతువేయడం, విఫలులైతే బండెడు దిగులుతో క్రుంగిపోవడం అన్నదాన్ని తను హర్షించలేడు. సాధ్యమైనంత వఱకు బాధ్యతన్నదానికి దూరంగా ఉండటమే తనతత్వం. బయటవాళ్ళేలా అనుకుంటేనేం సుబ్బులికి తనతత్వం బాగా తెలుసు. ఇప్పుడు తల్లిలా సరిదిద్దుకుపోతోంది. రేపు సుబ్బులలా దిద్దుకు పోగలదు అందులోనూ, కుటుంబ పరిస్థితులన్నీ సుబ్బులికి బాగా తెలుసు. అదే పరాయిదానికైతే ఎలా తెలుస్తాయ్-ఆలోచనలు సాగిపోతున్నాయ్. ఇంట్లో గోడగడియారం ఎనిమిది గంటలు కొట్టింది. రోడ్డు చివరికంటా ఓసారి పారచూచాడు. రోజూ మామూలే. గడియారం అలా ఎనిమది గంటలు కొట్టేసరికి, సుబ్బులు, పుస్తకాలు తీసుకు ప్రయివేటుకు పోతుంటుంది ఆ అరుగుముందునుంచే.

సుబ్బులూ, జగన్నాథాలు కళ్ళతో మాట్లాడుకోవడం పెదవులమీదికి చిఱునవ్వు తెప్పించుకోవడం హృదయాల్ని కాస్త తేలిక బర్చుకోవడం ప్రతినిత్యం ఆ సమయంలో మామూలే అందుకే ఆలోచిస్తున్న వాడల్లా ఠకీల్న ఆగి, అటు రోడ్డువంక చూచాడు.

సుబ్బులు తూరీగలా వచ్చేస్తోంది. మూడు రంగులచీర దూరానికే కొట్టొచ్చినట్లు కనబడుతోంది. సుబ్బులుదగ్గర పడుతూన్న కొలదీ-జగన్నాథం హృదయంలో, ఆనందం కుప్పిగంతులు వేస్తుంది. దగ్గరకి రానిచ్చి అటూ - ఇటూ చూచి "ఇదిగో-సుబ్బుబూ" నెమ్మదిగా పిలిచాడు.

"ఏం" అంది సుబ్బులు, అరుగుదగ్గరకొచ్చి జగన్నాథంవంక కొంటెగా చూస్తూ.

ఆ చూపులు జగన్నాథం హృదయానికి గిలిగింతలు పెట్టాయ్.

"ఇ...హ ..హి...హీ" వెక్కిరిస్తూ నవ్వి ష్కారగాచూచి మరి నేపోతున్నా, బావా ఎందుకు పిలిచావ్ అంది సుబ్బులు.

"మరేంలేదు - నీతో అవసరంగా చాలా విషయాలు మాట్లాడాలి. రాత్రి సరిగ్గా ఎనిమిది గంటలకి, కోనేటిగట్టుదరిన, మొగలితోటలోకి...ఊఁ, నీకోసం కాసుకూర్చుంటా" ప్రశ్నార్థకంగా జబ్బులు ముఖంలోకి చూస్తూ అడిగాడు జగన్నాథం.

"అబ్బా, పాపం అలాగా" అంటూ నవ్వేసి కదలిపోయింది సుబ్బులు. అంటే తప్పకుండా

వస్తుందన్నమాటే. ఆ విషయం జగన్నాథానికి తెలుసు, రావడానికి వీల్లేకపోతే "ఊహూ" అని కచ్చితంగా చెప్పేస్తుంది. వచ్చేటప్పుడు మాత్రం "ఊఁ అలాగే వస్తానని" చస్తే చెప్పదు. అంతా బెట్టుసరి వ్యవహారం సుబ్బులుది.

పోతూన్న సుబ్బులువంక అలా చూస్తున్న వాడల్లా తలుపు చప్పుడై గుమ్మంవంక చూచి అలానే కొయ్యబారిపోయాడు జగన్నాథం. తలుపు చాటుగా నిలబడి ఉంది బుచ్చమ్మ.

"అమ్మా మంచినీళ్ళు" అన్నాడు ఏమీ పాలుపోక. బుచ్చమ్మ సైతం ఏమీ ఎరగనట్టే నటించింది. మంచినీళ్ళు తెచ్చిచ్చింది. గ్లాసు అందుకోబోయిన జగన్నాథం చేతులు వడికినై. పైకి కన్పించకుండా లోలోపలే నవ్వుకుంది బుచ్చమ్మ.

రాత్రి గడియారం ఎనిమిది కొడుతూండగా, బుచ్చమ్మ కళ్ళు తెరచి కొడుకు మంచంవంక చూచింది. లేచి పిల్లిలా అడుగులేసుకుంటూ, బయటికి నడుస్తున్నాడు. మళ్ళీ ఓసారి లోలోపలే నవ్వుకుని ఊరుకుంది. బుచ్చమ్మకు సైతం సుబ్బులు పైన అకారణ ద్వేషం ఏమీ లేదు. తన కొడుకంటే ఇష్టమేనన్న సంగతి తెలుసుంటే 'మా బంగారుతల్లివిగదే' అని మెటికలు విరుచుకునేదే. తను ఐదువేలు కట్నం అడిగినమాట వాస్తవమే తన కొడుక్కి ఉన్న స్థితికి ఆ కట్నం యెలానూ వస్తుంది. అది రివాజేనయ్యె. ఆ ఉద్దేశ్యంతోనే తను కట్నం అడిగింది. పోనీ నేనిచ్చుకోలేనని నచ్చచెప్పటానికి ప్రయత్నించక, పుల్లవిరుపు మాటల్లోకి దిగేసరికి అడగవలసిన నాలుగు మాటలూ అడిగి అన్నవీ వొద్దన్నీ కూడా దులిపేసి చక్కా వచ్చింది. దానిలో తను చేసిన తప్పుమట్టుకేముంది ఆలోచిస్తూనే కునుకేసింది బుచ్చమ్మ. జగన్నాథం వడివడిగా అంగలేసుకుంటూ మొగలితోటదగ్గర నడిచాడు. అప్పటికే సుబ్బులక్కడికొచ్చి, బిక్కుబిక్కుమంటూ జగన్నాథంకోసం ఎదురుచూస్తూ కూర్చునుంది.

"వచ్చావా బావా" అంది జగన్నాథం రావడంతోనే. "ఊఁ వచ్చా" నన్నాడు జగన్నాథం. సుబ్బులు ప్రక్కనే కూర్చుంటూ "చూచావా, నీకోసం నే నెదురుచూస్తానన్నా, కాని నాకోసమే నువ్వెదురు చూడవలసి వచ్చింది" అన్నాడు జగన్నాథం కొంటెగా. కోపంతో మూతి బిగించి "ఊఁ సరేలే చెప్పు. ఎందుకు రమ్మన్నావు" అంది.

"ఇంట్లో ఏమని చెప్పొచ్చావ్" చెప్పదంటూ ప్రశ్న వేశాడు జగన్నాథం. కాసేపెక్కువ కాలక్షేపం చేయవచ్చునన్న ఉద్దేశంతో.

"ప్రైవేటుకని, పరీక్షలు దగ్గరకొచ్చినై కదూ రాత్రిపూట కూడా ప్రైవేటు కెడుతున్నా" అంది సుబ్బులు.

"మరి ప్రైవేటుకీ రాత్రి వెళ్ళలేదని తెలిస్తే."

"అబ్బా! ఎంతాశే ... పాపం ఇప్పుడెళ్ళిపోవద్దూ. ఏమిటో త్వరగా చెప్పెయ్" అంది సుబ్బులు తొందరపడుతూ.

అలా తొందరపడుతూనే గంటలకొలదీ ఉండిపోయిన సంఘటనలు జగన్నాథానికి తెలుసు. అదీ సుబ్బులు బెట్టుసరివ్యవహారాలలోని ఒకభాగమేనన్న సంగతి ఏనాడో గ్రహించుకున్నాడు.

"మరేంలేదు. మీ నాన్న ఏమంటున్నాడు?"

"నాన్న అనేదేముంది. తమ్ముణ్ణి చదివించాలా ఇంకా ఇద్దరు చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు చెయ్యాలా, ఉన్నదే ఆరెకరాలేయ్యె వేలకివేలు కట్నం యెలా ఇవ్వగలడు నీకు తెలియందేముంది చెప్పు?" అంది

"ఛ...కట్నంమాట కాదు. పెళ్ళివిషయం నే నెరుగుతూంట."

"అదా" అంటూ సిగ్గుతో తలొంచివేసింది సుబ్బులు.

గెడ్డంక్రింద వ్రేలుంచి, ముఖాన్ని పైకెత్తుతూ లాలనగా అడిగాడు జగన్నాథం. "సిగ్గెందుకూ-చెప్పు సుబ్బులూ" అని.

"చెప్పేదేముంది అంతా నాయిష్టమే నాన్న ఎదురు చెప్పడు" అంది సుబ్బులు మరికాస్త సిగ్గుపడుతూ.

అని జగన్నాథం జేబుతడిమింది. చుట్టలు అగ్గిపెట్టే జేబునిండా ఉన్నాయ్.

గభాల్న అవతలకి జరిగిపోయి "నువ్వు చుట్టలు కాలిస్తే అసలు నన్ను ముట్టుకోవద్దు బాబూ" అంది కోపాన్ని అభినయిస్తూ "వొట్టు మానేస్తానన్నాగా." అంటూ సుబ్బుల్ని దగ్గరకి తీసుకున్నాడు జగన్నాథం.

"అబ్బ ఇక వదలిపెట్టి వెళ్ళిపోతా చాలా ఆలశ్యమైంది" అంది సుబ్బులు.

విడిచిపెట్టాడు జగన్నాథం.

తిరిగి ఏదో సంభాషణ కొనసాగించబోయింది సుబ్బులు.

పక్కన నవ్వాడు జగన్నాథం నవ్వి, కోపం నటిస్తూ అన్నాడు.

"ఊ బొత్తిగా భయంలేకుండా పోయింది. పరీక్షల ముందు చదువుకోవాలన్న శ్రద్ధలేకుండా. త్వరగా వెళ్ళు" అని.

"అసలీసారి నేనొస్తే అప్పుడడుగు" అంది.

ఇద్దరూనవ్వుకున్నారు. లేచిడొళ్ళోకినడిచారు.

పిల్లిలా అడుగులేసుకుంటూ మంచం దగ్గరికి నడుస్తున్న జగన్నాథాన్ని "ఎక్కడికెళ్ళి వస్తున్నావురా" ప్రశ్నించిందిమంచపైపడుకున్న బుచ్చమ్మ.

ఇంటికప్పు అమాంతంమీద పడినట్టయి "అమ్మా మంచినీళ్ళ"న్నాడు తిరిగి.

నవ్వుతూలేచి, మంచినీళ్ళు తెచ్చిచ్చి "ఏంరా జగన్నాథం నాతోకూడా చెప్పకుండా అంతగా దాచిపెట్టుకున్నావ్ నేనంతా గ్రహించాలే. సుబ్బుల్ని ఇంటివఆకు జాగ్రత్తగా దిగవిడిచి వచ్చావా రాత్రిపూటకూడాను. మాఘమాసంలో మంచి ముహూర్తాలున్నాయ్ ఏమంటావ్" అంది బుచ్చమ్మ.

మొదట సిగ్గుపడి తరువాత ఈసారి "ఊఁ" అన్నాడు జగన్నాథం.

---

<u>స్కెచ్</u>

# సినిమాలో అతను

<u>లక్ష్మీప్రసాద్</u>

"ఏంవేఁ రమణీ! సినిమాచూస్తే ఇల్లంతా స్టూడియో ఆయిపోయేది, మా అందరికీ సినిమా చూడవలసిన పనే వుండేదే కాదే! ఇవ్వాళింత నిశ్శబ్దంగా వున్నావేం?"

"అసలు మాకర్థమయితేగా!... తెలుగు పిక్చరయితే—. పోనీ పాట్లయినా లేవు మంచివి."

"కథయినా తెలిసిందా?"

"కథకేం, ఇదివరకు చదివిందేగా నవల. దానికేంగానోదినా, నిన్న భలే తమాషా అతన్ని చూశాంలే! నువ్వూ రావల్సింది."

"నీ మొహం!"

"ఇక్కడ నలుగురం బయల్దేరామా, సరస్వతి ఇంటికి వెళ్ళేసరికి చిన్నచిన్న చినుకులు ప్రారంభం అయినయ్యి. రిక్షాల్లో పోదామంటే, అయిదుగురం వున్నాం. మా కారులో పోదామంది గొప్పగా. సరే ఆ డొక్కుకారు స్టార్టయ్యేప్పటికి బ్రహ్మాండమయింది—

"ఆ చివర కూర్చున్న రత్నమాల, ఈ చివర కూర్చున్న నేనూ సగం తడిసేము. చెమ్మచెమ్మగా చీకట్లో హాల్లోకి అడుగుపెట్టేము, పిక్చరు బిగినయింది. హౌస్‌ఫుల్ అయిందని మేనేజరు, పాపం మమ్మల్ని పదిహేనణాలకే ఫస్టుక్లాసులో కూర్చోబెట్టేడు! అప్పటికి మేం కూర్చున్న 'రో' అంతా ఖాళీయే. ఇంకో అయిదునిముషాలకి ఆ చివర రంగనాయకమ్మ ప్రక్కనొకడు, ఈ చివర రత్నమాల ప్రక్కనొకడు బాడీగార్డ్స్ సిద్ధమయ్యేరు. "ఒరే! భలే వెచ్చగా వుందిరా" అని ఒకడు, రత్నమాల ప్రక్కనున్నవాడు "ఇక్కడ చలిరా" అంటున్నాడు. రత్నమాల అసలే పిరికిది. నా చైర్‌లోకది, దాని చైర్‌లోకి నేనూ మారేము. అయినాను, ఫూల్స్ ఒకటే గోల. ఇలాకాదని, అందరంలేచి ఓ చివరకి పోయేం.

"కొంత గొడవ వదిలింది అనుకుంటే, సెమ్మదిగా ఒక్కొక్క కుర్చీ నిండిపోయింది, పెద్దమనుష్యులు మూలాన్ని నా ప్రక్కసీటు ఖాళీగానే వుండిపోయింది, గౌరవంగానే కూర్చున్నారు. నాకుహిందీరాకపోయినా స్టోరీ తెల్సునుగా. ప్రక్కనున్న ఉష అడుగుతుంటే అదీ ఇదీచెప్తున్నాను.

"ఇంతలో ఎవరో హఠాత్తుగా, ఆయాసంతో వగర్చుకుంటూ వచ్చి నా ప్రక్కనున్న కుర్చీ దులుపుకుంటున్నాడు. పూర్తిగా ముద్దకూడా అయిపోయినట్టున్నాడు వానలో. నేను మామూలుగా చూసేనంతే అతని వంక. ఏమనుకున్నాడో ఏమో—